
# స్థితప్రజ్ఞులు



'ఆంధ్రజ్యోతి' వారపత్రిక . . . 7 ఆగస్ట్, 1998

ఆగ్రా స్టేషనులో బల్లమీద అసహనంగా కూర్చున్నాడు శేఖర్.

ఏ.పి. ఎక్స్‌ప్రెస్ రాత్రి 8 :30 కి కాని రాదు. అంటే... ఇంకా మూడు గంటలు పైగా వేచి వుండాలన్నమాట! ఐన్‌స్టీన్ ఒకసారి తన ప్రఖ్యాత 'రెలెటివిటీ థియెరీ' గురించి హాస్యభరితంగా చెప్పిన ఉదాహరణ జ్ఞాపకానికి వచ్చింది...

'మీరు మీ ప్రియురాలితో కాని, ప్రాణమిత్రునితో కాని ముచ్చటిస్తున్నారనుకోండి... మీకు కాలం ఇట్టే గడిచిపోయినట్లనిపిస్తుంది. గంటలు నిమిషాలులా దొర్లిపోతాయి. అదే మీ ప్రక్కన ఒక 'బోరు'స్వామి కూర్చుని వాయించేస్తున్నాడనుకోండి... లేదా, ఏ పని చేయాలో తోచక కూర్చున్నారనుకోండి- నిమిషాలు కూడా గంటలుగా, రోజులుగా గడుస్తున్నట్టు విసుగు కలుగుతుంది.'

తానున్న పరిస్థితిలో తనకీ ఉదహారణ చక్కగా అన్వయించినట్లనిపించింది. జైపూర్‌లో అఖిల భారత రచయితల సమావేశం జరిగింది. అందులో పాల్గొనడానికి వెళ్లాడు శేఖర్. హైదరాబాద్ నుంచి జైపూర్‌కి డైరెక్ట్ ట్రైన్ లేనందువల్ల ఆగ్రా వరకు ఏ.పి.లో వచ్చి అక్కడినుంచి బస్‌లో వెళ్లాడు. తిరుగు ప్రయాణాన్ని కూడా ఆగ్రా నుంచి బుక్ చేసుకోవడంతో ఆనాటి ప్రొద్దున 9 గంటల బస్‌లో బయలుదేరి వచ్చాడు.

ఆగ్రా చాలాసార్లు చూసిందే! మళ్లీ మళ్లీ చూడడానికేం లేదు. పైగా, దిక్కుమాలిన బస్ ప్రయాణం! వంటిని హూనం హూనం చేసి, జైపూర్‌లో మూడురోజులు సరదాగా గడిపిన ఆనందం లేకుండా చేసింది. చేసేదిలేక వచ్చి స్టేషన్‌లోనే కూర్చున్నాడు. కాలక్షేపానికి కాసేపు చదువుకుందామని పత్రిక తీశాడు కాని, విసుగ్గా వుంది. చదవబుద్ధి కాలేదు. తలంతా దిమ్ముగా వుంది.

కాస్త వేడివేడి టీ త్రాగితే కుదుట పడుతుందని బయలుదేరాడు.

ఒక్కోసారి టీస్టాల్స్ దగ్గర అనుకోకుండా పరిచయాలు ఏర్పడుతాయి. కొన్నిసార్లు అవి కొత్తవ్యక్తులతోనైనా గాఢంగా అల్లుకుపోతాయి. అంతగా పెనవేసుకుపోయే స్నేహం కాకపోయినా- కూర్చున్నంతసేపు కమ్మగా కబుర్లు చెప్తూ కాలక్షేపం చేయించేవారెవరైనా కనబడితే బాగుండుననిపించింది శేఖర్‌కి.

అది మధ్యాహ్న సమయమేమో- ఆ సమయంలో వచ్చేపోయే రైళ్లు కూడా ఏవీ లేవేమో- టీస్టాల్ దగ్గర కూడా ఖాళీగా వుంది. కస్టమర్ కోసం కనులు కాయలు కాసేలా ఎదురుచూసే 'రెడ్‌లైట్ ఏరియా'లోని 'అరుణ కుమారి'లు లాగా షాప్‌కీపర్ కౌంటర్ మీదనుంచి ముందుకి వంగిచూస్తున్నాడు. శేఖర్‌ని చూడగానే ప్రసన్న వదనంతో-

"బోలియే..!" అన్నాడు.

మామూలుగా అయితే కస్టమర్ ఆర్డర్ విని మెకానికల్‌గా, మౌనంగా అడిగినది ఇచ్చి డబ్బులు తీసుకోవడం ఉంటుంది కాని- పలుకూ ఉలుకూ ఉండవు.

శేఖర్ "ఏక్ చాయ్ హోనా!" అనగానే-

"స్నాక్స్ భీ హోనా క్యా?" అని ప్రశ్నించాడు.

"చాయ్ బస్!" అనగానే టీ డ్రమ్ తిప్పి కప్పులో అందించాడు.

'పలుకే బంగారమాయేనా!' అన్నట్లుండే వీడిని కదిలించి కాసిని కబుర్లు చెప్పించి విందాం...' అనిపించింది శేఖర్‌కి.

"రాధారమణ్ మందిర్ అభీ బన్ రహే క్యా?" అని అడిగాడు. అది దయాల్‌భాగ్ భక్త సంఘం వారు పూర్తిగా పాలరాయితో తాజ్‌మహల్‌ను తలదన్నే రీతిగా నిర్మించాలని తలపెట్టి దశాబ్దాలుగా కట్టూనే వున్న రాధాకృష్ణ మందిరం అది.

"హా జీ... వో బన్‌తా హీ రహేగా!" అన్నాడు షాప్ కీపర్ పుల్లవిరువుగా.

ఇంతలో... ఒక రైల్వేపోర్టర్ వచ్చి, "సాబ్ చార్ ఇస్పెషల్ చాయ్ భేజో బోలే! జల్దీ భేజ్ దో!" అంటూ సైంధవుడిలా అడ్డుపడ్డాడు.

'ఇస్పెషల్ చాయ్' తయారు చేయడంలో నిమగ్నమయ్యాడు చాయ్‌వాలా.

ఇంతలో... మరో ఇద్దరు వచ్చి టీకి ఆర్డరిచ్చారు. వాళ్ళ చేతుల్లో బ్రీఫ్‌కేసులూ, భుజాలకి బ్యాగ్‌లూ ఉండడంతో వాళ్ళూ ప్రయాణీకులని తెలుస్తోంది. టీ త్రాగుతూ వాళ్ళలో వాళ్ళు మాట్లాడుకోసాగారు.

ఆ వచ్చింది ఒక్కడే అయితే ఏదైనా మాట కదిపేవాడే! 'ప్రథమ కబళేమశకపాల్' అన్నట్లు- మొదటిప్రశ్నకే సైంధవుడు అడ్డుపడ్డాడనుకుంటూ... ఖాళీ కప్పును కౌంటర్ మీద పెట్టేసి బయలుదేరాడు శేఖర్.

తిరిగి వెళ్లేసరికి అంతకుముందు తను కూర్చున్నచోట ఇంకెవరో కూర్చొనివున్నారు. ఇంక పచార్లు చేయడమే గత్యంతరమనుకుని ఫ్లాట్‌ఫాం మీద నడక మొదలుపెట్టాడు. ఫ్లాట్‌ఫాం మీద కొందరు కూర్చుని, మరికొందరు పడుకుని వున్నారు. చాలాచోట్ల నేలమీద ఉమ్ములు, పళ్ళతొక్కలు, కాగితాలు... అన్నిచోట్ల లాగానే పడివున్నాయి.

ఓవర్ బ్రిడ్జికి ఒకప్రక్కగా ఒక వ్యక్తి పడుకుని ఉన్నాడు. 'పడుకుని ఉన్నాడు' అనడం కంటే 'పడి ఉన్నా'డంటే సబబుగా ఉంటుంది. అతని దుస్తులు పరమ మురికిగా అట్టలు కట్టివున్నాయి. తల చింపిరిగా ఉంది. ముఖం, పాదాలు, చేతులు జిడ్డు కట్టి

మట్టి పేరుకుని ఉంది. మనిషి నిద్రపోవడం లేదు. అతని ప్రక్కనే అతని లాగానే బాగా నలిగి, మురికి పట్టిన రెండు రూపాయల నోటుంది. అది అతని జేబులోంచి పడిపోయినట్లుంది.

శేఖర్ అతని దగ్గర నిలబడి, "ఏయ్ఁ... నీ డబ్బు పడిపోయింది. తీసుకో!" అన్నాడు.

ఆ వ్యక్తి కళ్ళు సగం తెరిచి మళ్లీ మూసుకున్నాడు. శేఖర్ మాటలు అతనికి వినిపించాయో, లేదో- విన్నా అర్థం అయిందో, కాలేదో- అర్థమైనా లేచి తీసుకునే ఓపిక ఉందో, లేదో... శేఖర్‌కి అర్థంకాలేదు.

శేఖర్ వంగి ఆ నోటును తీసి అతని మురికి జేబులో కుక్కాడు.

ఆ నోటుని, ఆ మురికి మనిషిని ముట్టుకోవడం కంపరం అనిపించినా- కేవలం మానవత్వంతో ఆ పని చేశాడు. చేయి అతని వంటికి తగిలేసరికి- చొక్కా జేబున్నా కూడా అతని వళ్ళు బాగా వేడిగా అనిపించింది. అతనికి జ్వరం తీవ్రంగా ఉందన్న విషయం తెలుస్తూనే వుంది. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు కూడా వేడిగా తగిలాయి.

నోటు జేబులో పెడ్తూంటే ఆ స్పర్శకి అతను కొంచెం కదిలి, కొంచెంగా కళ్ళు తెరిచి మళ్లీ మూసుకున్నాడు. అతనికి లేచే ఓపిక కూడా బొత్తిగా లేదని తెలుస్తూనే ఉంది. పాపం... ఎవరో అతను? ఎక్కడి నుంచి వచ్చాడు? ఏ ఊరికి వెళ్లాలో కదా! బికారిగా ఆ ప్లాట్‌ఫాం మీదనే ఉంటూ జ్వరం వచ్చి పడిపోయాడు.

ఆ స్థితిలో అతన్ని చూసేసరికి మనసు ద్రవించి పోయింది శేఖర్‌కి. ఏం చేయాలి? పాపం... అతనెవరో దిక్కూమొక్కూ లేకుండా చచ్చిపోతాడో ఏమో! విలువైన ప్రాణానికి ఎంత విలువ లేకుండా పోయింది?

ఆ సంగతి స్టేషన్‌లోని రైల్వే అధికారులకి చెప్తే వారేమైనా చర్య తీసుకోవచ్చు ననిపించింది శేఖర్‌కి. ఓవర్ బ్రిడ్జికి కొంచెందూరంలోనే ఎగ్జిట్ డోర్ ఉంది. అక్కడ యూనిఫాంలో ఉన్న టికెట్ కలెక్టర్ ఉన్నాడు.

శేఖర్ ఆయన దగ్గరికి వెళ్లి, "సార్... అక్కడ ఒక మనిషి పడున్నాడు. బాగా జ్వరంతో బాధపడ్తున్నట్టున్నాడు. ఆలస్యం అయితే చచ్చిపోతాడో, ఏమో! అతనికేమైనా సహాయం చేయాలి!" అన్నాడు.

ఆయన తలెత్తి, "ఎక్కడా..?" అన్నాడు.

శేఖర్ "అదుగో..." అంటూ ఆ దిశగా చూపించాడు.

ఆయన నిర్లిప్తంగా తలను పైకీ, కిందకీ ఆడించాడు.

"ఇవన్నీ మామూలే! పనీ పాటా లేనివాళ్ళంతా వచ్చి ప్లాట్‌ఫాం మీదనే మకాం పెట్టేసుకుంటారు. ఇదేమైనా వాళ్ళబ్బ సొత్తనుకుంటారో, ఏమో!" అంటూ చిరాకుపడ్డాడు.

"లేదు సార్... అతను బికారిగా అనిపించడం లేదు. ప్రయాణీకుడేమో! ప్రక్కన సంచి కూడా ఉంది!"

"ఎవడో... బాగా తాగి పడుంటాడు!"

"లేదు సార్... బాగా జ్వరంతో బాధపడ్తున్నట్లనిపిస్తోంది..."

"మీకెలా తెలుసు?"

"జేబులోని డబ్బు ప్రక్కన పడిపోయినా తెలుసుకోలేని స్థితిలో ఉన్నాడు. చెప్పినా తీసుకోలేకపోయాడు. ఆ డబ్బు జేబులో పెడ్తుంటే వళ్ళు సలసల కాగిపోతున్నట్లని పించింది."

శేఖర్ నోటినుంచి 'డబ్బు జేబులో పెడ్తుంటే...' అన్న మాటలు వినగానే అతని వైపు అనుమానంగా చూశాడు టికెట్ కలెక్టర్.

"సర్లెండి... మాకు చెప్పారుగా- యూకెన్ గో!" అన్నాడు.

"ప్లీజ్... డు ది నీడ్‌ఫుల్ హి అప్పియర్స్ టు బి సీరియస్!" అన్నాడు శేఖర్ ఆవేదనతో.

ఓసారి బుఱ్ఱ ఆడించి చూపులు ప్రక్కకు తిప్పుకున్నాడు టికెట్ కలెక్టర్. ఆయన నిర్లక్ష్య వైఖరికి మనసు చివుక్కుమంది శేఖర్‌కి.

మరికొంచెం ముందుకి వచ్చేసరికి- ఒక రైల్వేపోలీస్ చేతిలో లాఠీ పట్టుకుని వస్తూ కనిపించాడు. అతన్ని చూడగానే 'ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం కూడా పోలీసుల విధులలో ఒకట'న్న విషయం గుర్తుకివచ్చింది శేఖర్‌కి.

అతనికి దగ్గరగా వెళ్ళి, "సార్... ఓవర్ బ్రిడ్జి దగ్గర ఒక మనిషి పడున్నాడు. బాగా జ్వరంతో బాదపడ్తున్నట్టున్నాడు!" అన్నాడు.

"అయితే ఏమంటావు?" అన్నాడు పోలీసు లాఠీ నలుపుతూ.

"అతనికి వెంటనే వైద్య సహాయం అవసరమనిపిస్తోంది!"

"దానికి నేనేం చేస్తాను?"

"ఇటువంటి సమయాల్లో పోలీసులు సహాయం చేయాలనీ, అది వారి విధి అనీ అంటారు?"

"అంటారా? ఎవరా అనేది?"

శేఖర్ ఏమీ మాట్లాడలేదు.

"ఇంతకీ... తమరెవరు?" వెటకారంగా అడిగాడు ఆ పోలీసు.

"నేనో సామాన్య భారతీయ పౌరుడ్ని!" తానూ వెటకారంగా సమాధానం చెప్పాడు.

"ఏం చేస్తుంటారో..?!"

"నేనొక జర్నలిస్టుని! జైపూర్‌లో రైటర్స్ కాన్ఫరెన్స్‌కి వెళ్లి తిరిగి వస్తున్నాను."

'జర్నలిస్ట్!' అన్న మాట వినగానే పోలీసు ధోరణిలో మార్పు వచ్చింది. "మీరు చెప్పిన మనిషి ఎక్కడున్నాడు? చూపించండి!" అన్నాడు మర్యాదగా.

"రండి..." అంటూ దారితీశాడు శేఖర్. ఆ మనిషి కనపడగానే, "అడుగో... అతనే!" అంటూ దూరాన్నుంచే వ్రేలితో చూపించాడు.

"ఎవడో బాగా చిత్తుగా తాగి పడుకుంటాడు. ఇదంతా మామూలే!" అంటూ దూరాన్నుంచే తీర్పు ఇచ్చేశాడు పోలీసు.

"కాదు లెండి! దగ్గరకొచ్చి చూడండి... మీకే తెలుస్తుంది!" అన్నాడు శేఖర్.

ఆ పోలీసు దగ్గరకొచ్చి ఆ మనిషిని చూసి, "ఊఁ... ఇంక మీరు వెళ్లండి. నేను చెయ్యాల్సింది చేస్తాను!" అన్నాడు వెనుదిరిగి.

"థాంక్స్! దయచేసి త్వరగా అటెండవండి. అతనెవరో ముక్కూ మొహం కూడా నాకు తెలీదు. కేవలం జాలిపడి మీకు చెప్తున్నాను. ఆలస్యం అయితే ప్రాణం పోతుందేమో! పోయిన ప్రాణాన్ని తిరిగి తీసుకురాలేంగా?" అన్నాడు శేఖర్ ఆందోళనగా.

పైకీ, క్రిందికీ ఓసారి తలాడించి వెళ్లిపోయాడు పోలీసు.

శేఖర్ ప్లాట్‌ఫాంకి రెండవ వైపుకి నడక సాగించాడు. ముప్పావు గంట గడిచింది. శేఖర్ మళ్లీ ఓవర్ బ్రిడ్జి వైపు వచ్చాడు.

'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే!' అన్నట్లు ఆ మనిషి ఇంకా అక్కడే పడివున్నాడు. ఈసారి అతని మీద ఈగలు కూడా ఎక్కువగా ముసిరి వున్నాయి. చేయాల్సింది చేస్తానన్న పోలీసు జాడ లేదు. తల ఆడించిన టికెట్ కలెక్టర్- ఆయనా లేడు.

మనవాళ్ళ బాధ్యతారహిత ప్రవర్తనకీ, నిర్లక్ష్యవైఖరికీ శేఖర్ మనసు చాలా క్షోభించింది. చేసేదేమీ లేక తిరిగివస్తూంటే... ప్లాట్‌ఫాం మీద పోలీస్ అసిస్టెన్స్ బూత్ కనిపించింది. అందులో స్టూల్ మీద కూర్చుని జోగుతున్నాడు- ఓ యూనిఫాంలో వున్న పోలీస్.

అతని దగ్గరకు వెళ్లి, "సార్..." అని పిలిచాడు శేఖర్.

అతను కంగారుగా లేచి, కళ్ళు పెద్దవి చేసి చూశాడు.

"ఏం కావాలి?" అని అడిగాడు కనుబొమలు ఎగురవేస్తూ.

కథ అంతా మళ్లీ వినిపించాడు శేఖర్.

"మా కెందుకు చెప్తున్నారు? అది రైల్వే ప్లాట్‌ఫాం మీదున్న వ్యవహారం! రైల్వేవాళ్ళకు చెప్పండి!" అన్నాడు చిరాగ్గా.

"ముందుగా టికెట్ కలెక్టర్‌కే చెప్పాను సార్! వాళ్ళు పట్టించుకోకపోతేనే పోలీసులకు చెప్పాను."

"హుఁ... అన్నీ మాకే చెప్తారు. అన్నీ మాకే చెప్తారు. రైల్వేవాళ్ళు ఉన్నది ఎందుకు?"

"సార్! ఎవరు చేయాలా... అన్నది వదిలేయండి. అవతల ఒక మనిషి నిండుప్రాణం ప్రమాదంలో ఉంది. అయినా నాకు తెలిసినంతవరకు ఇటువంటివి రైల్వే పోలీసులే అటెండవ్వాలి!" అన్నాడు శేఖర్ కొంచెం గట్టిగా.

శేఖర్ గద్దించి అనేసరికి, ఏమనుకున్నాడో... ఆ 'బూతు' పోలీసు కొంచెం తగ్గాడు.

"ఇప్పుడు ఆరవుతోంది. నా డ్యూటీ అయిపోతోంది. వేరే డ్యూటీ పోలీస్ వస్తాడు. అతనికి చెప్పండి!" అన్నాడు.

శేఖర్‌కి చిర్రెత్తుకొచ్చింది...

"చూడండీ... ఇందులో నాకేదో ఇంటరెస్ట్ ఉందనుకోకండి! నేను ఇంకో రెండు గంటల్లో హైద్రాబాద్ వెళ్లిపోతాను. మనిషి ప్రాణం పోతుంటే చూడలేక చెప్పాను కాని, ఇందులో నాకు ఒరిగేదేమీ లేదు. జర్నలిస్ట్‌గా నేను చేయగలిగింది ఈ విషయం గురించి పేపర్లో ఘాటుగా రాయడమే!" అన్నాడు హిందీలో దంచుతూ.

'జర్నలిస్ట్' మంత్రం మళ్లీ పనిచేసింది.

మారుమాట్లాడకుండా లేచి బయటకొచ్చి,

"ఆ మనిషి ఎక్కడున్నాడో చూపించండి!" అన్నాడు పోలీసు.

శేఖర్ ఆ పోలీసును వెంట తీసుకువెళ్లాడు.

ఆ మనిషి కంటబడగానే, "వీడా? వీడు నిన్నటినుంచి ఇక్కడే పడివున్నాడు. ప్రయాణీకులకు పెద్ద న్యూసెన్స్!" అన్నాడు పోలీస్.

"నిన్నటి నుంచి ఇలాగే పడున్నాడా? ఏమిటి సార్... ఇంత పెద్ద స్టేషన్లో దిక్కులేక పడున్న ఒక మనిషిని అందరూ వదిలేశారా?" అన్నాడు శేఖర్ ఆవేశంతో.

అతని మాటలు పట్టించుకోకుండా, ఆ మనిషిని దగ్గర్నుంచి చూస్తూ “ఇది తాగుడు కేసే! వీడిని ఇక్కడ నుంచి బయటకు నెట్టించేస్తాను!” అంటూ వెనుదిరిగాడు పోలీసు.

శేఖర్ కొయ్యబారిపోయాడు... ‘ఇప్పుడు ఈ నిర్భాగ్యుడికి కనీసం పడివుండడానికి కాస్తంత నీడైనా ఉంది. రోడ్ ప్రక్కకి నెట్టేస్తే మున్సిపాలిటీ వాళ్ళు బ్రతికుండగానే చచ్చాడనుకుని ఈడ్చేస్తారు కూడా!’ అనిపించింది.

‘ఎంత దారుణం! ఈ పోలీసెంత తెలివిగలవాడు. స్టేషన్‌లోపల జరిగేవాటికి వాళ్ళ బాధ్యత ఉంటుంది. అదే బయటయితే ఏ బాదరబందీ ఉండదు. అందుకని తన చేతులు దులిపేసుకోడానికి ఒక నిర్భాగ్యుడు ప్రాణంపోయే స్థితిలో ఉన్నా, నిస్సంకోచంగా బయటకు నెట్టేయాలనుకుంటున్నాడు. తను ఇంకా మాట్లాడితే అసలు కంటి ముందున్నా అన్నంత పనీ చేస్తానన్నా చేస్తాడు!’ అని భయమేసింది శేఖర్‌కి.

“సరే... మీ డ్యూటీ అయిపోతుందన్నారుగా! మీ రిలీవర్‌కి ఈ విషయం చెప్పి తగిన చర్య తీసుకోమని చెప్పండి!” అంటూ ఇంక అక్కడుండలేక చకచక వెళ్ళిపోయాడు.

పోలీసు తాపీగా తన బూత్‌లో ‘డ్యూటీ’కి వెళ్లాడు.

మరో గంట గడిచింది!

ఆత్రుత ఆపుకోలేక తిరిగి ఓవర్ బ్రిడ్జివైపు వెళ్లాడు శేఖర్. పోలీస్ బూత్ ఖాళీగా వుంది. ‘రిలీవరుడు’ ఇంకా రాలేదు కాబోలు. మరికొంచెం దూరం నుంచి ఓవర్ బ్రిడ్జి దగ్గర ఆ వ్యక్తి లేకపోవడం కనిపించింది. శేఖర్‌కి గుండెమీద నుంచి బండ దింపి నట్లయింది. మనసు హంస రెక్కలాగా తేలికై ఆనందంతో తేలిపోయాడు.

‘పోనీలే... కనీసం ఈ ఒక్క పోలీసుకైనా మానవత్వం ఉంది. ముందు పట్టించుకోక పోయినా తర్వాతైనా ఆ నిర్భాగ్యుడికి సహాయం చేసినట్లున్నాడు. స్వయంగా వెంటపెట్టుకుని రైల్వే హాస్టల్స్‌కి తీసుకువెళ్లి వుంటాడు!’ అని మనసులోనే అభినందించాడు.

కాని, ఒకప్రక్కన మనసు పీకుతోంది. ‘అతన్ని ఆస్పత్రికి పంపించాడా? లేక, రోడ్ మీదకి నెట్టేశాడా?’ అని!

ఇంక ఏ.పి. ఎక్స్‌ప్రెస్ రావడానికి మరొక్క నలభై నిమిషాలే ఉంది. ఆగ్రాలో బూడిద గుమ్మడికాయతో కోసే ‘పేటా’ స్వీట్ బాగా ప్రసిద్ధి! అది స్టేషన్ బయట దుకాణాల్లో చాలాచోట్ల దొరుకుతుంది. దానిని కొనుక్కువద్దామని స్టేషన్ నుంచి బయటకు వచ్చాడు శేఖర్. కాని, అక్కడున్నవాళ్ళు “కోయి మర్గయా...” అని అనుకుంటూండడం విని అటు వెళ్లాడు.

జనం కాళ్ల మధ్యనుంచి మురికిపట్టిన షర్ట్ కనిపిస్తోంది.

శేఖర్ గుండె ఝల్లుమంది! వడివడిగా జనం దగ్గరికి వెళ్లి వాళ్ళని తప్పించుకుని చూశాడు. అంతే... శేఖర్ కళ్ళు బైర్లు కమ్మాయి.

ఆ శవం... ఆ నిర్భాగ్యుడిదే!

'హుఁ... ఆ పోలీస్ అన్నంత పనిచేసి ఆ దౌర్భాగ్యుడిని స్టేషన్ ప్రాంగణంలో ఉండకుండా రోడ్ అవతలికి నెట్టేయించాడన్నమాట! ప్రాణం పోయాక ఈడ్చేశారో, ఈడ్చేశాకే ప్రాణం పోయిందో... మొత్తంమీద ఆ జీవి కన్నుమూసింది. మరో ఆకు పండకుండానే ఎండి రాలిపోయింది!'

బరువెక్కిన మనసుతో వెనుదిరిగాడు శేఖర్. తల తిరిగిపోతోంది. కాస్తంత టీ త్రాగితేనే కాని, మనసు కుదుట పడేట్లు లేదు. దగ్గర్లోనే వున్న రెస్టారెంట్‌కి వెళ్లాడు.

అక్కడి దృశ్యం చూసేసరికి కళ్ళు తిరిగి క్రిందపడిపోయేలా అనిపించింది. రెస్టారెంట్‌లో ఓ మూల టేబుల్ చుట్టూ ఆ టికెట్ కలెక్టరూ, ఆ ఇద్దరు రైల్వే పోలీసులూ, ఇంకో వ్యక్తీ సరదాగా కబుర్లు చెప్పుకుంటూ, సమోసాలు తింటూ, చాయ్‌లు త్రాగుతున్నారు.

వాళ్ళని చూస్తుంటే... దేనికీ చలించని 'స్థితప్రజ్ఞులు' అనిపించింది.

*'ఆంధ్రజ్యోతి' వారపత్రిక . . . 7 ఆగస్ట్, 1998*

అమ్మకానికి అందుబాటులో ఉన్న
కె.ఆర్.కె. మోహన్ ఇతర రచనలకై ఈ పుస్తకం చివరి పేజీల్లో చూడండి...